క్లుప్తంగా

నాగుల గుడిలో విశేష పూజలు

పిడుగురాళ్ల : పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులో వేంచేసి ఉన్న నాగుల గుడి దేవస్థానంలోని మహాగణపతికి బుధవారం సంకష్ట హర చతుర్థి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం మహాగణపతి పూజ అలాగే పంచామృతాలు, విశేష ద్రవ్యాలతో, 27 రకాల నూనెలతో స్వామి వారికి విశేష అభిషేకాలు నిర్వహించటం జరిగింది. భక్తులు విశేషంగా హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు ప్రారంభం



మాచర్ల : ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం మాచర్లలో బుధవారం పల్నాడు జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిలర్ మధు బాబు, మాచర్ల మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కుంభ పోతురాజు, సుధాకర్, సునీల్, అనిల్ కుమార్, కోటేశ్వరరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై స్పెషల్ డ్రైవ్



పిడుగురాళ్ల: పట్టణంలోని అన్ని ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ అన్నారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ శ్రీధర్ ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రతపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మెయిన్ రోడ్డుపై ఉన్న చెత్తను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పరసరాలు పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పిడుగురాళ్ల పట్టణాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా మార్చటమే లక్ష్యమని, ప్రతి రోజు అన్ని వార్డులు తిరుగుతూ కార్మికుల చేత శుభ్రం చేయిస్తున్నామన్నారు. అలాగే సైడు కాలువలను రోడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచితంగా కంప్యూటర్ కోర్సులో శిక్షణ

మాచర్ల : మాచర్ల పట్టణంలోని రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద స్ఫూర్తితో మాచర్ల శ్రీశైలం రోడ్‌లోని స్వామి వివేకానంద సేవాశ్రమంలో నిరుద్యోగులకు రెండో బ్యాచ్‌కు ఉచితంగా కంప్యూటర్ కోర్సులో శిక్షణ తరగతులు బుధవారం నిర్వహించారు.

మాతా జగదాంబ, సేవాలాల్ ఆలయ ప్రథమ వార్షికోత్సవం

విజయపురిసౌత్: స్థానిక దేశవరపు క్యాంపు తండాలో వేంచేసియున్న మాతా జగదాంబ, అభయాంజనేయస్వామి, సద్గురు సేవాలాల్ మహరాజ్ ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డికి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వామి వారి ఆశీస్సులు తండా వాసులకు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.దారునాయక్, పంగులూరి పుల్లయ్య, టీడీపీ మాచర్ల మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్, వీపీ సౌత్ టీడీపీ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, ఆడెపు కోటయ్య, రామ్‌చంద్ నాయక్, అప్పలరాజు, సత్తిబాబు, వెంకటేశ్వర్లు, డా.బసివిరెడ్డి, ధనుంజయరావు, శేరెడ్డి గోపీరెడ్డి, పరమేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఊరే మార్క్, మస్తాన్, నరసింహులు, హాతీరామ్, నర్సింహులు పాల్గొన్నారు.

డీసీ చైర్మన్ భాస్కర్‌రావుకు సన్మానం



దాచేపల్లి : తంగెడ మేజర్ కాలువ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన పగడాల భాస్కర్‌రావుని బుధవారం సన్మానించారు. నగర పంచాయతీ పరిధిలోని జలవనరుల శాఖ కార్యాలయంలో డీసీ చైర్మన్‌గా ఎన్నికైన భాస్కర్‌రావుని ఏఈలు పసుపులేటి ఆదినారాయణ, శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ తోట వెంకటేశ్వర్లు, డీసీ మాజీ చైర్మన్ నర్రా పుల్లయ్య, బెల్లంకొండ బద్రి, తంగెళ్ల శ్రీనివాసరావు, సొసైటీ నారాయణ, వేముల తిరుమలకుమార్ తదితరులు శాలువా, పూలమాలలతో సన్మానించి అభినందించారు.

ఉత్తుత్తి ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లు..!

- నినాదానికే పరిమితమైన సురక్షితం.. సుఖవంతం
- ప్రథమ చికిత్స కిట్టులు లేని ఆర్టీసీ ప్రయాణం
- కనీసం దూది కూడా లేని పరిస్థితి
- పట్టీపట్టనట్టు ఉన్న ఆర్టీసీ అధికారులు



ఆర్టీసీ బస్సులో ఖాళీగా ఉన్న ఫస్ట్ ఎయిడ్ బాక్స్



ఇటీవల రెడ్డిగూడెం వద్ద జరిగిన ప్రమాదం

పిడుగురాళ్ల: ప్రయాణమంటేనే ఎప్పుడు ఏ ప్రమాదం వచ్చి పడుతుందో తెలియని పరిస్థితి. ప్రయాణాలలో ఒక్కొక్కసారి ప్రమాదాలు జరుగుతాయన్న విషయం కూడా ప్రతి ఒక్కరికీ తెలిసిందే. అయినప్పటికీ వారి వారి అవసరాల రీత్యా ప్రతి వ్యక్తి ఉన్న స్థానం నుంచి మరో స్థానానికి ఏదో ఒక వాహనం ద్వారా ప్రయాణించాల్సిందే. ఇలా ప్రజలు ప్రయాణించేందుకు ప్రభుత్వం రవాణా సౌకర్యం కల్పించింది. ప్రజలకు సేవలు అందించేందుకు నియమ నిబంధనలతో ఆర్టీసీ బస్సులను నడుపుతుంది. ఈ బస్సులలో ప్రయాణం సుఖవంతం.. సురక్షితం అనేది ఆర్టీసీ నినాదం కూడా. అయితే ప్రమాదాలు జరిగినప్పుడు ఆర్టీసీ బస్సులో కచ్చితంగా ఫస్ట్ ఎయిడ్ కిట్టు ఉండాలన్న నిబంధన ఉంది. ఆర్టీసీ బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్టు బాక్స్ కంటికి కనిపిస్తుంది కానీ దాని లోపల ఫస్ట్ ఎయిడ్‌కు సంబంధించిన ఏ వస్తువులు మాత్రం అందుబాటులో ఉండని పరిస్థితి. ఖాళీ ఫస్ట్ ఎయిడ్ బాక్సులతో ఆర్టీసీ బస్సులు ప్రయాణం సాగిస్తున్నాయి.

కిట్టులో ఉండాల్సినవి

ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లో పలు రకాల సైజులలో అతుక్కునే గుణం కలిగిన బ్యాండేజీలు, దూది, త్రికోణపు బ్యాండేజి చుట్టు, ప్లాస్టర్, కత్తెర, రెండు జతల చేతికి తొడుక్కునే గ్లౌజ్‌లు, యాంటీ సెప్టిక్ ద్రావణం, సబ్బు, డిజర్జెంట్ , పారాసెటిమాల్ మాత్రలు వంటివి ఉండాలి. వీటి వలన ప్రజలకు డాక్టర్ వద్దకు వెళ్లేలోపు ప్రథమ చికిత్స తెలిసిన వారు ఎవరైనా వాటిని ఉపయోగించి ప్రథమ చికిత్స చేసేందుకు వీలుగా ఆర్టీసీ బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఉండాలి.

దూది కూడా లేదు

గత వారం రోజుల క్రితం రాజుపాలెం మండలం రెడ్డిగూడెం సమీపంలో ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొంది. అయితే ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. అటుగా ప్రయాణిస్తున్న పిడుగురాళ్ల పట్టణానికి చెందిన ఓ వైద్యుడు క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేసేందుకు ప్రయత్నించాడు. ఆర్టీసీ బస్సులో ఉన్న ఫస్ట్ ఎయిడ్ కిట్టులో దూది ఉంటుంది ఇవ్వమని ఆర్టీసీ సిబ్బందికి తెలపటంతో ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌ను తెరిచారు. బాక్స్‌లో ప్రథమ చికిత్స చేసేందుకు కనీసం దూది కూడా లేకపోవటంతో ప్రయాణికులు, ఆ వైద్యుడు ఆశ్చర్యానికి గురయ్యారు. ఆర్టీసీ బస్సులోనే ప్రథమ చికిత్స నిర్వహించేందుకు కావాల్సిన ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లో ఏమీ లేవని ఆర్టీసీ అధికారులు గుర్తించకపోవటం ఎంత మాత్రం సరైన పద్ధతి కాదని ప్రయాణికులు అనుకుంటున్నారు.

ప్రమాదాల సమయంలో ఉపయోగం



ఆర్టీసీ ప్రయాణం సురక్షితం, ప్రమాదాలు అనేవి చెప్పి రావు కనుక ప్రమాదాలు జరిగే సమయంలో ఆర్టీసీ బస్సులో ఉన్న ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లో కచ్చితంగా ఫస్ట్ ఎయిడ్ కిట్టు ఉండేలా ఆర్టీసీ సిబ్బంది బాధ్యతగా పరిశీలించుకుంటే ప్రమాదాలు జరిగినప్పుడు ఫస్ట్ ఎయిడ్‌తోనే కొన్ని ఘటనల్లో ప్రాణాలను కాపాడుకునే అవకాశం ఉంటుంది.

– ధీకొండ శ్రీనివాసరావు, ఆర్టీసీ ప్రయాణికుడు

ప్రథమ చికిత్స కీలకం



ప్రమాదం జరిగిన వెంటనే ఒక వ్యక్తి ప్రాణాలను కాపాడాలంటే ప్రథమ చికిత్స ఎంత అవసరమో అది చేసేందుకు ఫస్ట్ ఎయిడ్ కిట్టు కూడా అంతే అవసరం. ఆర్టీసీలో తప్పనిసరిగా ఫస్ట్ ఎయిడ్ కిట్టు ఉండాలి. దాని ద్వారా ఎంతో మంది ప్రాణాలు ఆధారపడి ఉంటాయి.

– డాక్టర్ రవితేజ, ప్రభుత్వ వైద్యులు, లెనిన్ నగర్

ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లను పరిశీలిస్తాం



ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లో కిట్టులు లేవన్న విషయం నా దృష్టికి రాలేదు. ఇప్పుడు ఈ సమస్య నా దృష్టికి రావటంతో డిపోలో ఉన్న ప్రతి ఆర్టీసీ బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లను పరిశీలించి ఫస్ట్ ఎయిడ్ కిట్టు ఉండేలా చర్యలు తీసుకుంటాం.

– వెంకటేశ్వర నాయక్, డీఎం, పిడుగురాళ్ల

డీబీటీతోనే విక్రయాలు జరపాలి

ఏడీఏఆర్ శశిధర్‌రెడ్డి

గురజాల రూరల్ : డీబీటీతోనే ఎరువుల విక్రయాలు జరపాలని వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం ఏడీఏఆర్ శశిధర్‌రెడ్డి సూచించారు. మండల పరిధిలోని చర్లగుడిపాడు, గంగవరం గ్రామాల్లో పలు ఎరువుల దుకాణాలపై బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. డీబీటీ ద్వారా విక్రయించిన వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని అలా నమోదు జరిగితే ప్రభుత్వం మరలా వాటిని సరఫరా చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. రైతులు ఎరువులు కొన్న వెంటనే ఈ పాస్ ద్వారా బయోమెట్రిక్ వేస్తే కేంద్రం ద్వారా వారికి రావాల్సిన రాయితీ అందించడం జరుగుతుందన్నారు. వివిధ ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో గురజాల మండల వ్యవసాయాధికారి ఎం.సంధ్యారాణి తదితరులున్నారు.

తూనికలు కొలతల శాఖ అధికారుల తనిఖీలు



కారెంపూడి: తూనికలు కొలతల శాఖ అధికారులు కారెంపూడిలో రేషన్ షాపుల్లో ఉన్న ఎలక్ట్రానిక్ కాటాలను బుధవారం తనిఖీ చేశారు. ఎస్‌ఎస్‌పీ కాలనీలోని వినాయకుని గుడి వద్దకు కాటాలతో రప్పించి వాటిని తనిఖీ చేశారు. ఇదిలా ఉంటే ముందుగా గ్రామంలో వ్యాపార దుకాణాలను తనిఖీ చేయడానికి యత్నించారు. ఇది గమనించిన వ్యాపారులు షాపులన్నీ మూసి వేశారు. దీంతో అధికారులు రేషన్ డీలర్లను రెవెన్యూ అధికారుల సహకారంతో ఒక చోటికి రప్పించి కాటాలను తనిఖీ చేశారు.

రెవెన్యూ సదస్సులో 31 అర్జీలు



నడికుడిలో రెవెన్యూ సదస్సు

దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలోని నడికుడి వార్డు సచివాలయంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ వైవీ కుటుంబరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో రైతుల నుంచి 31 అర్జీలను స్వీకరించారు. భూమి కొలతలు, అడంగల్‌లో భూమి ఎక్కించటం, గట్ల సమస్యలు పరిష్కరించాలని రైతుల నుంచి అర్జీలు వచ్చాయని తహసీల్దార్ చెప్పారు. అదే విధంగా వార్డు పరిధిలో పర్యటించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సదస్సులో ఆర్‌ఐ శరత్‌కుమార్, సర్వేయర్ శ్రీనివాసరావు, దేవదాయ శాఖ ఈవో నెమలిరెడ్డి, వీఆర్వో పత్రా రమేష్, స్థానిక నాయకులు నర్రా పుల్లయ్య, సొసైటీ నారాయణ, బుల్లెబ్బాయి, శ్రీరాములు పాల్గొన్నారు.



పిన్నెల్లి రెవెన్యూ సదస్సులో తహసీల్దారు క్షమారాణి, రెవెన్యూ అధికారులు

రెవెన్యూ సదస్సుకు 16 అర్జీలు

మాచవరం: మండలంలోని పిన్నెల్లి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 16 అర్జీలు అందినట్లు తహసీల్దారు క్షమారాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొలం ఆన్‌లైన్, పట్టాదారు పాసు పుస్తకాలు, పొలం సవరణలకు సంబంధించి దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ కోటేశ్వరరావు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





మార్కెట్‌యార్డులో ధాన్యం ఆరబోత



నడికుడి వ్యవసాయ మార్కెట్‌యార్డులో ధాన్యాన్ని బుధవారం ఆరబోశారు. ఖరీఫ్ సీజన్‌లో దిగుబడి వచ్చిన ధాన్యాన్ని రైతులు పొలంలో నుంచి తీసుకువచ్చి మార్కెట్‌యార్డులో ఆరబెడుతున్నారు. యంత్రాల ద్వారా పంటలో వరి కోతలు చేయటంతో ధాన్యం గింజ పచ్చిగా ఉంది. దీంతో రైతులు నడికుడి వ్యవసాయ మార్కెట్‌యార్డులో ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. గింజ ఆరిన తరువాత విక్రయిస్తున్నారు.

–దాచేపల్లి

సమష్టి కృషితోనే సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధ్యం

ఎంపీడీఓ కె.సరోజినిదేవి

రెంటచింతల: సమష్టి కృషితోనే గ్రామాలలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధ్యమని ఎంపీడీఓ కె.సరోజినిదేవి అన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖాధికారులకు, సచివాలయ సిబ్బందికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించుటకు 9 థీమ్స్‌పై ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామాలలో పేదరికాన్ని నిర్మూలించడంతో పాటు ఆకలి బాధలను నివారించి ఆహార భద్రతను కల్పించడం, పోషకతత్వాన్ని మెరుగుపర్చడం, ఆరోగ్య సంరక్షణ, జీవన ప్రమాణాలు పెంపు, నాణ్యమైన విద్య, తాగునీటి వసతి, పారిశుద్ధ్యాన్ని పెంపొందించడం, అసమానతల తొలగింపు, శాంతి, న్యాయం వంటి లక్ష్యాల సాధనలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో పీఆర్‌ఏఈ వెవకటేశ్వర రెడ్డి, ఎంఈఓ–2 వై.శివ నాగేశ్వరరావు, మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి, ఈఓపీఆర్డీ సీహెచ్ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెన్ను వెంకటేష్, ఆర్‌ఐ పల్లా రామకృష్ణ, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, పశు సంవర్ధక, మత్స్య శాఖ సహాయకులు, మహిళ పోలీసులు, సర్వే అసిస్టెంట్స్, జూనియర్ లైన్ మెన్లు పాల్గొన్నారు.



శిక్షణ తరగతులలో అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీఓ సరోజినిదేవి

సుస్థిర అభివృద్ధిపై అవగాహనా కార్యక్రమం

మాచవరం: గ్రామాల సుస్థిర అభివృద్ధిపై ప్రజా ప్రతినిధులు అవగహనా కలిగి ఉండాలని ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామాల సుస్థిరాభివృద్ధిపై పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచులకు శిక్షణ కార్యక్రమం మూడవ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సభల ద్వారా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు గ్రామ పంచాయతీలలో ప్రణాళికలు తయారు చేసుకొని, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని అన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రతినిధుల తోడ్పాటు అవసరమని తెలియజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ప్రసాద్, ఈఓపీఆర్‌డీ వెంగళరావు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

మహా విష్ణువు అనుగ్రహం కోసమే ధనుర్మాస పూజలు

రెంటచింతల: మహా విష్ణువు అనుగ్రహం కోసమే భక్తులు ధనుర్మాస పూజలు చేస్తారని రెంటాల శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ ప్రధాన అర్చకులు పూరిమెట్ల శేష భట్టాచార్యులు అన్నారు. బుధవారం మండలంలోని రెంటాల గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో, రెంటచింతలలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో, తుమ్మకోట గ్రామంలోని జనార్ధనస్వామి ఆలయంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు నిర్వహించారు. ధనుర్మాసంలో దీపారాధన చేయడం వలన ఇహలోకంలో సర్వ సంపదలు, పరలోకంలో మోక్షప్రాప్తి లభిస్తాయని అర్చకులు తెలిపారు.



శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీచెన్నకేశవస్వామి

పేటసన్నెగండ్ల ఇన్‌చార్జి సర్పంచ్‌గా రాజేశ్వరి



కారెంపూడి: మండలంలోని పేటసన్నెగండ్ల గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్‌గా తోడేటి రాజేశ్వరి బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. పంచాయతీ కార్యాలయంలో ఆమె చేత పంచాయతీ కార్యదర్శి పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. గతంలో ఇన్‌చార్జి సర్పంచ్‌గా కొనసాగుతున్న జవ్వాజి నాగేంద్రం సెలవు పెట్టడంతో ఆమె స్థానంలో సర్పంచ్‌గా విధులు నిర్వహించేందుకు రాజేశ్వరిని ఎన్నుకున్నారు.

అంగన్‌వాడీ పోస్టుల దరఖాస్తుకు నేడే ఆఖరు

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల ఐసీడీసీ కార్యాలయ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల సహాయకురాళ్ల పోస్టులకు అర్హత కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పిడుగురాళ్ల సీడీపీవో రుక్సానా బేగం బుధవారం తెలిపారు. ఆయా పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తులను ఈ నెల 19వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు పిడుగురాళ్ల పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో నేరుగా అందించాలని ఆమె తెలిపారు.

సౌత్ జోన్ ఖోఖో టీమ్‌కు తిరుమల ఆక్స్‌ఫర్డ్ విద్యార్థిని

పిడుగురాళ్ల: నరసరావుపేట విక్టరీ డిగ్రీ కాలేజీలో ఈ నెల 17, 18 తేదీలలో జరిగిన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ స్థాయి ఖోఖో పోటీలలో పిడుగురాళ్ల పట్టణంలోని తిరుమల ఆక్స్‌ఫర్డ్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ పి.ఫణి కిషోర్‌బాబు బుధవారం తెలిపారు. యూనివర్సిటీ స్థాయిలో ట్రోఫీ సాధించారని, అలాగే ఈ పోటీల్లో బీజెడ్‌సీ తృతీయ సంవత్సరం చదువుతున్న కన్నా త్రిష అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఆచార్య నాగార్జున టీమ్‌కు ఎంపికై ందని ఆయన తెలిపారు. కన్నా త్రిషను ప్రిన్సిపాల్స్ పితాన నరేష్, కోపూరి ఫణికుమార్‌బాబు, ఫిజికల్ డైరెక్టర్లు నాగరాజు, వేణుగోపాల్, రాజీవ్‌లు అభినందించారు.



కన్నా త్రిష



ఖోఖో పోటీల్లో గెలుపొందిన తిరుమల ఆక్స్‌ఫర్డ్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు

గుంత ఉంది.. జాగ్రత్త..!

పిడుగురాళ్ల: పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో జానపాడు రోడ్డు మూలమలుపు వద్ద వాటర్ పైపు లైన్ మరమ్మతుల కోసం గుంతను మున్సిపల్ సిబ్బంది తవ్వారు. ఈ గుంత తవ్వి సుమారు 5, 6 రోజులు అవుతుంది. పూర్తిస్థాయిలో మరమ్మతులు కాకపోవటంతో గుంతను అలాగే ఉంచారు. నిత్యం వాహనదారులు, ప్రజల రాకపోకలు సాగే ఈ ప్రాంతంలో తవ్విన గుంత ఎప్పుడు పూడుస్తారని పుర ప్రజలు ఎదురు చూస్తున్నారు. దీనిపై మున్సిపల్ ఏఈ రాఘవేంద్రను వివరణ కోరగా వాటర్ పైపు లైన్ మరమ్మతుల కోసం తవ్వాం, మరమ్మతులు కాగానే పూడ్చివేస్తామని తెలిపారు.



ఐలాండ్ సెంటర్‌లో వాటర్ పైపులైన్ కోసం తవ్విన గుంత

డాక్టరేట్ పొందిన అధ్యాపకునికి సన్మానం



మాచర్ల : విజయపురిసౌత్ ఏపీ ఆర్టీసీ డిగ్రీ కళాశాలలో అధ్యాపకునిగా పనిచేస్తున్న గుత్తికొండ వెంకటరామిరెడ్డి అల్వార్ ఎస్సార్ యూనివర్సిటీ ద్వారా డాక్టరేట్ పొందారు. డాక్టరేట్ పొందిన వెంకటరామిరెడ్డిని మదర్ థెరిసా సేవా సమితి సభ్యులు మాచర్ల పట్టణంలోని మదర్ థెరిసా కార్యాలయంలో బుధవారం ఘనంగా సన్మానించారు. మదర్ థెరిసా సేవా సమితి అధ్యక్షుడు జక్కిరెడ్డి మల్రెడ్డి మాట్లాడుతూ నిరంతరం విద్యార్థిలా నూతన విషయాలను అభ్యసించి విద్యార్థులకు బోధించాలని ఆసక్తి చూపేవాడే నిజమైన అధ్యాపకుడన్నారు. ప్రముఖ లాయర్ చిలమకూరి నాగిరెడ్డి మదర్ థెరిసా సేవా సమితి ప్రెసిడెంట్ గాదె కిరీటిరెడ్డి, ప్రధాన కార్యదర్శి మోర భాస్కర్ రెడ్డి, జె.శ్రీనివాసరావు, లాయర్ అందుగుల బాల జోజి పాల్గొన్నారు.